# మీడియా వాచ్ - ఇండియా

# MediaWatch-India

*Campaigning for Decency and Accountability in Media*

Regd. No. 884/2008
www.mediawatchindia.org

***అధ్యక్షులు:** ప్రకాశ్ సింగ్, IPS (Retd.)*
*మాజీ డీజీపీ & డీజీ, BSF*

***ఉపాధ్యక్షులు:** ఈదర గోపీచంద్*
*గాంధేయవాది, సంఘ సేవకులు*

## పరిచయ పత్రం

ప్రజలకు సమాచారం, వినోదం, విజ్ఞానం అందించే ప్రజాబాహుళ్య ప్రసార సాధనాలే మీడియా. ప్రపంచీకరణ, సరళీకరణల వలన, సమాచార–శాస్త్ర సాంకేతిక రంగాల్లో వచ్చిన పెనుమార్పుల వలన గత రెండు దశాబ్దాలుగా మీడియా యొక్క విస్తృతి, ప్రభావం ఎన్నో రెట్లు పెరిగాయి. నేడు *టెలివిజన్, రేడియో, సినిమాలు, పత్రికలు, పోస్టర్లు, ఇంటర్నెట్, మొబైల్ ఫోన్లు* – ఇవన్నీ మన దైనందిన జీవితాలలో అంతర్భాగమై పోయాయంటే అతిశయోక్తి కాదు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకపాత్ర వహించే **వార్తా మీడియా** (News Media) కేవలం సమాచార ప్రసారానికే పరిమితం కాకుండా సమాజంలోని అవినీతిని బట్టబయలు చేయడం, ప్రభుత్వ పాలనలో జవాబుదారీతనాన్ని పెంచడం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, సమకాలీన సామాజికోద్యమాలకు చేయూతనివ్వడం, ప్రభుత్వ విధాన నిర్ణయాలను ప్రభావితం చేయడం – ఇలా అనేక రకాలుగా గుణాత్మకమైన పాత్రను పోషిస్తోంది. ఇక **వినోద మీడియా** (Entertainment Media) విషయానికొస్తే సంఖ్యాపరంగా తక్కువైనప్పటికీ, విలువలున్న సినిమాలు, ప్రజలను చైతన్య పరిచే టీవీ కార్యక్రమాలు *(ఉదా॥ సత్యమేవ జయతే మొ॥నవి)* అప్పుడప్పుడైనా వస్తూండటం మనం గమనించి తీరాల్సిన విషయం.

సమాజంలో మీడియా యొక్క ఈ అత్యావశ్యకమైన పాత్రను గుర్తించడమే కాదు, ఆ సందర్భాలలో ఆయా మీడియా సంస్థల కృషిని ప్రత్యేకంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఉదాహరణకు ఉత్తమ పాత్రికేయ ప్రమాణాలు పాటించే మీడియా సంస్థలను, పాత్రికేయులను పౌరసమాజం తరఫున ప్రశంసించడం, ప్రజోపయోగమైన వార్తా కార్యక్రమాలకు, చర్చలకు ప్రాచుర్యం కల్పించడం, మంచి సినిమాలకు ఆదరణ పెరిగేలా ప్రచారం చేయడం మొదలైనవి.

అయితే నాణేనికి రెండు వైపులున్నట్లుగా సమాజంలో మీడియా నిర్వహిస్తున్న పాత్రకూ రెండో పార్శ్వం వుంది. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణల నేపథ్యంలో గత రెండు దశాబ్దాలుగా మీడియా రంగంలోకి అనేక బడా కార్పొరేట్ సంస్థలు ప్రవేశించాయి. పత్రికా యాజమాన్యం, సంపాదక వర్గం మధ్య గీత చెరిగిపోవడం వల్ల ఒకప్పుడు పవిత్ర వ్యాసంగంగా భాసిల్లిన పాత్రికేయం నేడు ఫక్తు వ్యాపారంగా మారిపోయింది. *'మేమున్నది వార్తాపత్రికల రంగంలో కాదు, వాణిజ్య ప్రకటనల వ్యాపారంలో'* అని దేశంలో అత్యధిక సర్క్యులేషన్ గల ఆంగ్ల దినపత్రికాధిపతి బాహాటంగా చెప్పారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. తత్ఫలితాలే నేడు వార్తా మీడియాలో ప్రబలుతున్న 'చెల్లింపు వార్తలు' (Paid News), సంచలనాత్మక ధోరణి (Sensationalism), అసత్య కథనాలు, రాజకీయ పక్షపాతం, నకిలీ శూలశోధనలు (Fake Sting Operations) మొ॥ దుష్పరిణామాలు.

అలాగే వినోద మీడియా – ముఖ్యంగా సినిమాలలో, టీవీ కార్యక్రమాలలో పెచ్చుమీరిన అశ్లీలత, అసభ్యత, మహిళలను కించపరిచే ధోరణి, హింసాత్మక ప్రవృత్తిని గ్లోరిఫై చేయడం, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ లాంటి నేరాలను హీరోయిజంగా చూపడం, ఉపాధ్యాయులను కించపరచడాన్ని కామెడీగా చూపడం, వెగటు పుట్టిస్తున్న కొన్ని రియాల్టీ షోలు – తదితర పెడధోరణులపై సభ్యసమాజం నుండి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

ఈ పరిస్థితుల్లో ప్రజాప్రయోజనాల వైపు నిలబడాల్సింది పోయి మీడియా వ్యాపారప్రయోజనాలు కాపాడడమే మా ధ్యేయం అన్నట్లు వ్యవహరిస్తున్నాయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు. ఈ ధోరణి అత్యంత గర్హనీయం. దశాబ్దాలు గడుస్తున్నా, కాలదోషం పట్టిన మీడియా చట్టాలను ఏ మాత్రం ఆధునీకరించకపోవడం, 'స్వయం నియంత్రణ' (Self-regulation) పేరుతో మీడియా రంగ సంస్కరణలపై చర్చే లేకుండా అడ్డుకుంటున్న మీడియా వర్గాలకు వత్తాసు పలకడం వరుస ప్రభుత్వాల బాధ్యతారాహిత్యానికి నిదర్శనాలు. మీడియా ధోరణులపై, మీడియా రంగ విధివిధానాలపై ప్రజల గళాన్ని బలంగా వినిపించేందుకు అభివృద్ధి చెందిన దేశాలలో అనేక పౌరసమాజ సంస్థలు పనిచేస్తున్నాయి. కానీ మనదేశంలో మాత్రం అలాంటి సంస్థలు ఇంకా ఏర్పడకపోవడం గమనార్హం.

ఈ నేపథ్యంలో మీడియాలో విలువలు, ప్రమాణాలు, జవాబుదారీతనం పెంచేందుకు కృషిచేసే ఒక ప్రజావేదికగా 'మీడియా వాచ్-ఇండియా' (MWI) 2007 అక్టోబరు 2న ఏర్పడింది. అప్పటికే రెండు దశాబ్దాలకు పైగా, అనగా 1986 అక్టోబరు 2 నుండి ఆంధ్రప్రదేశ్‌లో 'అశ్లీలతా ప్రతిఘటన వేదిక' పేరున మీడియాలో అశ్లీలతా, హింస తదితర అవాంఛనీయమైన ధోరణులపై 16 ప్రజాహిత మహిళా-విద్యార్థి సంఘాలు పోరాటాలు జరుపుతూ వచ్చాయి. అనేక విజయాలను సాధించాయి. MWI ఆవిర్భావం వెనుక ఈ ఉద్యమాల స్ఫూర్తి కూడా ఉన్నది.

పత్రికా స్వేచ్ఛపైన, స్వతంత్ర మీడియా యొక్క ఆవశ్యకత పైన MWI కి అచంచలమైన గౌరవం ఉంది. అయితే, వ్యాపారీకరణ, అనారోగ్యకర పోటీ పెరిగిన ప్రస్తుత నేపథ్యంలో మీడియా తన సామాజిక బాధ్యతను గుర్తెరిగేలా, ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ఆవశ్యకతను గుర్తించేలా చేయడమే సంస్థ ప్రధాన కర్తవ్యం.

## 'మీడియా వాచ్-ఇండియా' - ఆశయాలు

- మీడియాలోని ప్రచురణలు, ప్రసారాలు, ధోరణులపై ప్రజలయొక్క, పౌరసమాజం యొక్క అభిప్రాయాలను, ప్రశంసలను, విమర్శలను తెలియజేయడం;
- మీడియా వినియోగదారులుగా ప్రజలకున్న హక్కులను కాపాడటం;
- జాతీయ, ప్రాంతీయ స్థాయిలలో ఉన్న అనేక మీడియా సంబంధ చట్టాలు పటిష్టంగా అమలు అయ్యేలా చేయడం;
- మీడియా రంగంలో ఆవశ్యకమైన, ప్రజోపయోగమైన సంస్కరణల దిశగా కృషిచేయడం;
- సామాన్య ప్రజానీకంపై ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం చూపే అనేక మీడియా సంబంధ విధాన నిర్ణయాలలో ప్రజల, పౌరసమాజం యొక్క భాగస్వామ్యాన్ని పెంచడం;
- మీడియా సంబంధ చట్టాలపై ప్రజలలో అవగాహన, చైతన్యం కల్గించడం, సదస్సులు, చర్చలు, అభిప్రాయ సేకరణలు నిర్వహించడం.

## 'మీడియా వాచ్-ఇండియా' - ఇటీవల చేసిన కృషి, సాధించిన విజయాలు (2007-15)

✓ *'మీడియా వాచ్-ఇండియా' 2007 లో రిజిస్టర్ అయిన వెంటనే చిన్నదిగా కనిపించే అతిముఖ్యమైన అంశంపై దృష్టి సారించింది. **సినిమాలకు సెన్సార్‌బోర్డు ఇచ్చే రేటింగ్‌లు ('A', 'U/A', 'U', 'S')** ప్రజలకు సులువుగా అర్థమయ్యే పరిస్థితి ఈ నాటికీ లేదు. సినిమా ప్రదర్శనకు ముందు మానవమాత్రుడెవరికీ కనపడనిరీతిలో, ఏమీ అర్థం కాని విధంగా, హిందీ/ఇంగ్లీషులో మాత్రమే ఉండే సర్టిఫికెట్‌ను కొన్ని సెకెండ్లపాటు చూపే మతిలేని పద్ధతిని సవాలుచేస్తూ, MWI ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (WP(C) 15732/2009) వేయడం జరిగింది. తత్ఫలితంగా కేంద్ర ప్రభుత్వం సెన్సార్ రేటింగ్‌ల ప్రదర్శనను అధునీకరించేందుకు తన అంగీకారం తెలిపింది.*

✓ *స్త్రీల గౌరవాన్ని కించపరుస్తూ వీక్షకులలో నీచాభిరుచులు పెంచే విధంగా అర్ధరాత్రి వేళల్లో కొన్ని ఛానళ్లు ప్రసారం చేసిన అశ్లీల కార్యక్రమాలపై MWI 2012లో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ (Ministry of I&B)కి ఫిర్యాదు చేసింది. వీటి ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే **ABN ఆంధ్రజ్యోతి, N TV** ఛానళ్ల ప్రసారాలను 7 రోజులపాటు నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. (ఈ ఉత్తర్వుల అమలును నిలిపివేయాల్సిందిగా ఆయా ఛానళ్ళు ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించగా వారికి తాత్కాలిక ఊరట (stay) లభించింది. దీనిపై తదుపరి న్యాయపోరాటానికి MWI సిద్ధమవుతోంది.)*

✓ *కేబుల్ నెట్‌వర్క్ రూల్స్, 1994లో పొందుపరచబడిన కార్యక్రమ నియమావళి (Programme Code), ప్రకటనా నియమావళి (Advertising Code)ని అనేక రకాలుగా ఉల్లంఘించిన పలు జాతీయ, ప్రాంతీయ **టీవీ ఛానళ్లపై** MWI **గత 5సం॥లుగా సుమారు 80 ఫిర్యాదులు చేసింది.** కేంద్ర సమాచార ప్రసారమంత్రిత్వ శాఖ వీటిపై ఇంకా తమ అంతిమ నిర్ణయాలను వెలువరించాల్సి ఉంది.*

✓ *టీవీ ఛానళ్లలో 'A' సర్టిఫికెట్ పొందిన సినిమాల ప్రసారం నిషిద్ధం. ఈ నియమం వల్ల టీవీ ప్రసార హక్కుల ఆదాయం కోల్పోతున్న 'A' చిత్ర నిర్మాతలకు లబ్ధి చేకూర్చడానికి సెన్సారుబోర్డు ఒక అడ్డదారిని కనిపెట్టింది. థియేటర్లలో ప్రదర్శనకై 'A' సర్టిఫికెట్ ఇచ్చిన సినిమాలలో కొన్ని నామమాత్రపు 'కట్స్' చూపించి 'U/A' గా మార్చే అడ్డగోలు విధానానికి శ్రీకారం చుట్టింది. అలా అశ్లీలత, హింస, ద్వంద్వార్థాలతో కూడిన **'పెద్దల' సినిమాలన్నీ కొద్ది మార్పులతో టీవీలో అన్నివేళలా ప్రసారమవుతున్నాయి.** కుటుంబ సమేతంగా అందరూ చూసే టీవీ మాధ్యమం కలుషితం కావడానికి ప్రధాన కారణమైన ఈ అక్రమ విధానాన్ని MWI ఢిల్లీ హైకోర్టులో సవాలు*

*చేసింది (WP(C) 5203/2013). అలాగే, 12 సం॥లోపు పిల్లలు తల్లిదండ్రుల పర్యవేక్షణలో చూడవలసిన 'U/A' సినిమాలను టీవీ ఛానళ్లు నిర్దిష్ట వేళల్లో మాత్రమే ప్రసారం చేసే విధంగా కేబుల్ నెట్ వర్క్ నియమాలను సవరించాలని కూడా కోరింది.*

- ✓ ***టీవీ, రేడియో ప్రసారాల విషయంలో 'స్వయం నియంత్రణ'*** *జపం చేస్తున్న మీడియా సంస్థలకు వంతపాడుతూ, బ్రాడ్‌కాస్ట్ రంగ సంస్కరణలపై గత రెండు దశాబ్దాలుగా కేంద్రప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. బ్రాడ్‌కాస్ట్ బిల్లుపై తాము చేస్తున్నామని నమ్మబలుకుతున్న కసరత్తును ప్రభుత్వం ఎప్పటికప్పుడు కోర్టుకు నివేదించాలని కోరుతూ సుప్రీం కోర్టులో MWI ప్రజా ప్రయోజన వ్యాజ్యం (WP(C) 1024/2013) వేసింది. ఇదే అంశంపై దాఖలైన మరో రెండు పిటిషన్లతోపాటు ఈ వ్యాజ్యం ప్రస్తుతం సుప్రీం కోర్టు విచారణలో ఉంది.*

- ✓ *(i) టీవీ ఛానెళ్ళ విషయంలో 2007లో నిర్దేశించబడిన ప్రకటనల కాలపరిమితి* ***(గంటకు 12 ని॥లు మాత్రమే ప్రకటనలు)*** *ని ఖచ్చితంగా పాటించాలని, (ii) ప్రకటనల సమయంలో శబ్దాన్ని అతిగా పెంచరాదని 1994 నుంచే ఉన్న నియమాన్ని అమలుచేయాలని, (iii) నడుస్తున్న కార్యక్రమ వీక్షణకు అంతరాయం కలిగిస్తూ తెరప్రదేశాన్ని ఆక్రమించే ప్రకటనలు, స్క్రోలింగ్‌లను వేయరాదని 1994 నుంచే ఉన్న నియమాన్ని పాటింపజేయాలని – టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (TRAI) 2012లో నిబంధనలు జారీచేసింది. అయితే, కొన్ని నెలలకే మీడియా సంస్థల ఒత్తిడితో పైన పేర్కొన్న (ii), (iii) నిబంధనలను ట్రాయ్ హఠాత్తుగా తొలగించింది. టీవీ ప్రేక్షకుల ప్రయోజనాలకు చేటు కలిగించే ఈ ఏకపక్ష సవరణను MWI ఢిల్లీ హైకోర్టులో సవాలు చేసింది (WP(C) 2944/2014). కేబుల్ నెట్‌వర్క్ నియమాల అమలు విషయంలో ట్రాయ్ పరిధినీ, అధికారాన్నీ ప్రశ్నిస్తూ, అనేక టీవీ ఛానెళ్ళు దాఖలు చేసిన పిటిషన్లతో పాటుగా కోర్టు ఈ వ్యాజ్యాన్నీ స్వీకరించి ట్రాయ్‌కి నోటీసులు జారీ చేసింది.*

- ✓ *డైరెక్ట్–టు–హోమ్ (DTH) సర్వీసు ద్వారా కేంద్ర ప్రభుత్వ అనుమతి పొందిన TV ఛానళ్ళు తప్పితే మరే ఛానళ్లూ ప్రసారం చేయడానికి వీల్లేదు. ఈ నిబంధనను తుంగలో తొక్కుతూ* ***డీటీహెచ్ ఆపరేటర్లు (డిష్ టీవీ, టాటా స్కై, ఎయిర్‌టెల్ డిజిటల్ మొ॥నవి)*** *తమ సొంత ఛానళ్లు నడుపుతున్నారు. టీవీ ఆన్‌చేస్తే చాలు 24/7 ప్రకటనలతో హోరెత్తిస్తున్నారు. 'ప్రజాధనం' (Public Property)గా సుప్రీం కోర్టు పేర్కొన్న వాయుతరంగాలను డీటీహెచ్ సంస్థలు తమ అక్రమ వ్యాపారప్రయోజనాలకు వినియోగించుకోవడాన్ని MWI ఢిల్లీ హైకోర్టులో సవాలుచేసింది (WP(C) 9400/2014). వ్యాజ్యాన్ని స్వీకరించిన కోర్టు కేంద్ర ప్రభుత్వానికి, ఆరు ప్రైవేట్ డీటీహెచ్ ఆపరేటర్లకు నోటీసులు జారీ చేసింది.*

- ✓ *విశాఖపట్నం నగరంలో పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి అనుమతిలేని పోస్టర్లు, గోడ రాతలపై* ***'ఆంధ్రప్రదేశ్ బహిరంగ ప్రదేశాల వికృతీకరణ, అశ్లీల–అసభ్య పోస్టర్ల, ప్రకటనల నిరోధక చట్టం, 1997'*** *క్రింద కమీషనర్ ఆఫ్ పోలీసు, కార్పోరేషన్ కమీషనర్‌కు ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. ఫలితంగా విశాఖపట్నం 'పోస్టర్–ఫ్రీ' సిటీగా ప్రకటింపబడి, నగరంలోని గోడలపై పోస్టర్లు తొలగించడమే కాకుండా వాటి స్థానంలో మంచి సూక్తులు, ప్రజలను చైతన్యపరిచే సమాచారం వ్రాయించే కార్యక్రమం మొదలయ్యింది. 'స్వచ్ఛాంధ్రప్రదేశ్' లో భాగంగా ఇదే కార్యక్రమం రాష్ట్రమంతటా అమలు చేయాలని MWI ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసింది. అలాగే, అక్రమ పోస్టర్లపై దశాబ్దాలుగా ప్రేక్షకపాత్ర వహిస్తున్న రెవెన్యూ యంత్రాంగం వెంటనే చర్యలు తీసుకోకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని అన్ని జిల్లాల కలెక్టర్లకూ నోటీసులు పంపడం జరిగింది.*

- ✓ *మీడియా సంబంధ చట్టాల గురించి సామాన్య ప్రజలలో అవగాహన కలిగించడానికి తెలుగులో, అత్యంత సులభమైన రీతిలో* ***'మీడియా చట్టాలు, నిబంధనలు – విహంగ వీక్షణం'*** *అనే సవివరమైన కరపత్రాన్ని MWI ప్రచురించింది. దీన్ని పొందగోరేవారు www.mediawatchindia.org > What You Can Do ను సందర్శించవచ్చు.*

- ✓ *మీడియా ప్రసారాలు, ప్రచురణల పై ప్రజలు తమ అభిప్రాయాలను, ఫిర్యాదులను అత్యంత సులువుగా పంపేందుకు వీలుగా ఒక ఉచిత మొబైల్ యాప్‌ను MWI రూపొందిస్తోంది. త్వరలో ఈ యాప్, యాపిల్ (iOS App Store), యాండ్రాయిడ్ (Play Store) ద్వారా అందుబాటులోకి రానుంది.*

# 'మీడియా వాచ్-ఇండియా' - ప్రధాన డిమాండ్లు

**చట్టాల పటిష్ట అమలు:** ప్రస్తుతం వున్న మీడియా చట్టాలను, నిబంధనలను సమర్థంగా అమలుచేయాలి. మీడియా వినియోగదారులుగా పౌరులకున్న హక్కులను విస్తృతంగా ప్రచారం చేయాలి.

**బ్రాడ్‌కాస్ట్ మీడియా:** టీవీ, రేడియో ఛానళ్ల నియంత్రణ కోసం ఒక ప్రత్యేక, స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థను నెలకొల్పాలి. ఇందుకోసం ఉద్దేశించిన *(మీడియా వత్తిడితో అటకెక్కిన)* బ్రాడ్‌కాస్ట్ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్చకు పెట్టి చట్టం చేయాలి. టీవీ, రేడియో ప్రసారాలపై ప్రస్తుతం ఉన్న ఫిర్యాదు పరిష్కార యంత్రాంగం గురించి ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలి.

**ప్రింట్ మీడియా:** పత్రికాధిపతుల సొంత సంస్థగా, కోరలు లేని పులిగా మిగిలిపోయిన 'ప్రెస్ కౌన్సిల్' ను ప్రక్షాళన చేయాలి. ప్రజల హక్కులకు పెద్దపీట వేస్తూ UK లో లెవెసన్ కమిటీ సూచనల ఆధారంగా అమలు చేసిన 'రాయల్ ఛార్టర్' లాంటి చట్టం తేవాలి. 'చెల్లింపు వార్తల' నిరోధానికి వెంటనే నిర్దిష్టమైన చట్ట సవరణలు తేవాలి.

**సినిమా:** కాలదోషం పట్టిన సినిమాటోగ్రాఫ్ చట్టాన్ని సమూలంగా సంస్కరించాలి. అధికార పార్టీ అనుయాయులను సెన్సార్ బోర్డు సభ్యులుగా నియమించే పద్ధతిపోవాలి. నాలుగు గోడల మధ్య రహస్య తంతుగా సెన్సార్ ప్రక్రియ పూర్తి చేసి సినిమాలను దేశం మీదకి వదలడం కాకుండా, ఇతర దేశాల్లో లాగా, సెన్సార్ నిర్ణయాలపై విస్తృతమైన ప్రజాభిప్రాయాన్ని సేకరించాలి. వెబ్‌సైట్, సామాజిక మీడియా, మొబైల్ యాప్స్ ద్వారా సినిమాల రేటింగులు *(A, U/A, U)* ప్రేక్షకులకు సులువుగా తెలిసేట్లు చేయాలి. పాత నియమాలనే ఎత్తి రాస్తూ, అత్యంత లోపభూయిష్టంగా రూపొందించిన ముసాయిదా సినిమాటోగ్రాఫ్ బిల్లును ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలి.

**వాల్ పోస్టర్లు:** *'స్వచ్ఛ భారత్', 'స్వచ్ఛాంధ్ర ప్రదేశ్', 'స్మార్ట్ ఏపీ'* అంటూ నినాదాలిస్తున్న ప్రభుత్వం, రాష్ట్రంలో వీధివీధినా దర్శనమిచ్చే సినిమా తదితర అక్రమ పోస్టర్లను, గోడవ్రాతలను అరికట్టాలి. స్వచ్ఛంద సంస్థలు, స్పాన్సర్ల ద్వారా వాటి స్థానంలో మంచి సూక్తులు, ప్రజోపయోగ సమాచారం రాయించేలా రెవెన్యూ/మున్సిపల్/పోలీసు అధికారులకు ఖచ్చితమైన ఆదేశాలివ్వాలి.

**టెలికమ్ సేవలు:** మొబైల్/ఫోన్ వినియోగదారుల ఫిర్యాదులపై అప్పీళ్ల సత్వర విచారణకై టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (TRAI) 2004 లోనే ప్రతిపాదించిన ప్రత్యేక *'టెలికం అంబుడ్స్‌మెన్'* ను వెంటనే నెలకొల్పాలి.

**జిల్లా స్థాయి కమిటీలు:** అశ్లీలతా ప్రతిఘటన వేదిక, ఆంధ్రప్రదేశ్ విజ్ఞప్తి మేరకు G.O నెం. 731 ద్వారా కలెక్టర్ల అధ్యక్షతన, జిల్లాస్థాయిలో ఏర్పడిన అశ్లీలతా నిరోధక కమిటీల (Anti-Obscenity Cells) ద్వారా వార్తాపత్రికలు, పోస్టర్లలోని అశ్లీలత, అసభ్యతలపై సుమోటో గా చర్యలు చేపట్టాలి. అలాగే, కేబుల్ టీవీ, శాటిలైట్ ఛానళ్ల ప్రసారాలపై ఫిర్యాదులు స్వీకరించి, చర్యలు చేపట్టడానికి G.O నెం. 383 ద్వారా 2008లో కలెక్టర్ల అధ్యక్షతన ఏర్పాటైన జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీలను బలోపేతం చేయాలి. కాగితాలకే పరిమితమైన ఈ జిల్లా స్థాయి కమిటీల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి.

*'మీడియా వాచ్-ఇండియా' ఏ రాజకీయ పార్టీతో గానీ, మత సంస్థలతో గానీ, అనుబంధం లేని స్వతంత్ర ప్రజావేదిక. సమాజాన్ని అమితంగా ప్రభావితం చేస్తున్న మీడియాలో విలువలు, ప్రమాణాలు పెరగాలనీ, మీడియా వల్ల ప్రజా బాహుళ్యానికి మరింత మేలు చేకూరాలనీ ఆశించే ప్రతి ఒక్కరికీ ఇదే మా ఆహ్వానం.*

*సభ్యులుగా చేరేందుకు మీ పేరు, వృత్తి, చిరునామా, ఈ-మెయిల్ ID మాకు SMS/ఈ-మెయిల్ చేయండి. మీడియా ప్రచురణలు, ప్రసారాలపై మీ అభిప్రాయాలు, ప్రశంసలు, విమర్శలు, ఉల్లంఘనలు/ఫిర్యాదు చేయదగ్గ అంశాలు, సందేహాలు, SMS/ఈ-మెయిల్/ఫేస్‌బుక్ ద్వారా పంపండి.*


## 'మీడియా వాచ్ - ఇండియా'

# 11-7-17, నవోదయ నగర్, నరసరావుపేట - 522601, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

*mediawatchindia123@gmail.com*

**8500005263**

**www.mediawatchindia.org**

*www.facebook.com/mediawatch.india*